సాక్షి నల్లగొండ

గురువారం । 16 । నవంబర్ । 2023



ప్రజల ఆలోచన మారాలి
ఓటును నోటుకు అమ్ముకోకుండా ప్రజలు నిర్భయంగా వెయ్యాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. - 10లో



యాంత్రీకరణపై దృష్టి పెట్టాలి
రైతులు యాంత్రీకరణపై దృష్టిపెట్టాలని శాస్త్రవేత్తలు డాక్టర్ అమృత, డాక్టర్ స్వర్ణలతాదేవీ, మల్లారెడ్డి అన్నారు. - 12లో



బీజేపీ సంచలనం సృష్టిస్తుంది
తెలంగాణలో బీజేపీ మెజార్టీ స్థానాలు గెలిచి సంచలనం సృష్టిస్తుందని కేంద్ర మంత్రి శోభకరంద్లాజే అన్నారు. - 12లో

న్యూస్‌రీల్

సీఎం సభకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లింగయ్య

నకిరేకల్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 20న నకిరేకల్‌లోని మూసీ రోడ్డులో జరగనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ కోసం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ వాహనాల పార్కింగ్, ఇతర సౌకర్యాల కోసం స్థలాన్ని గుర్తించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'డిండి'లో 7.29లక్షల చేపపిల్లలు విడుదల

డిండి: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన 7.29 లక్షల చేపపిల్లలను బుధవారం డిండి మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టులో జిల్లా మత్స్యశాఖ అధికారులు వదిలారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ వెంకన్న మాట్లాడుతూ ప్రాజెక్టులో వదిలిన చేపపిల్లలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ మారయ్య, మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడు మేకల కాశన్న, సొసైటీ సభ్యులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

యూవిన్ పోర్టల్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న మహ్మద్‌అబ్దుల్ జమీర్

పెద్దవూర: చిన్నపిల్లలకు ఇచ్చిన వ్యాక్సినేషన్ల వివరాలను ఎప్పటికప్పుడు యూవిన్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మహ్మద్‌అబ్దుల్ జమీర్ అన్నారు. బుధవారం పెద్దవూరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యసిబ్బంది హాజరు పట్టికలు, ఇమ్యునైజేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యసిబ్బందికి యూవిన్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూవిన్ పోర్టల్‌లో వ్యాక్సినేషన్ వివరాలను నమోదు చేయడం వల్ల వ్యాక్సినేషన్ సర్టిఫికేట్ ఇవ్వడానికి సులభంగా ఉంటుందని తెలిపారు. సిబ్బందికి నిర్దేశించిన ఇమ్యూనైజేషన్ లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట డాక్టర్ నగేష్, ఫార్మసిస్టు రాము, సీహెచ్‌ఓ శ్రీనివాస్, ఏఎస్‌ఎంలు కె.విజయలక్ష్మి, రేణుక, వెంకటమ్మ, అంజలి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

మర్రిగూడ: ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం చేయడం తగదని డీఆర్‌డీఓ ఎం.కాళిందిని అన్నారు. బుధవారం మండలంలోని రాజాపేటతండాలో ఏర్పాటు చేస్తున్న నర్సరీని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమై కూలీలకు మొబైల్ అటెండెన్స్ నిర్వహణ, వేతనాలు చెల్లింపులపై సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు, ఏపీఓ గుంటుక వెంకటేశం, ఈసీఓ వివేక్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

మాడుగులపల్లి: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మండలంలోని ఆగామోత్కూర్, చిరుమర్తి, మాడుగులపల్లి, బొమ్మకల్లు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. నాణ్యత కలిగిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి బిల్లులు చెల్లించాలన్నారు. ఆయన వెంట ఏపీఎం నిజాముద్దీన్, ఆర్‌ఐ లింగస్వామి తదితరులు ఉన్నారు.


12 నియోజకవర్గాల్లో..
276 మంది పోటీ

నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది.. బరిలో నిలిచిన అభ్యర్థుల లెక్క తేలింది

అధికంగా మునుగోడులో 39, అతి తక్కువగా దేవరకొండలో 13 మంది

- 428 నామినేషన్లలో 79 మంది ఉపసంహరణ
- స్క్రూటినీలోనే 73 తిరస్కరణ
- కాంగ్రెస్ నేత పటేల్ రమేష్‌రెడ్డి ఉపసంహరణలో హైడ్రామా
- నల్లగొండ, నకిరేకల్‌లో ఉపసంహరించుకున్న కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులు
- 2018 ఎన్నికల కంటే ఈసారి బరిలో 74 మంది అధికం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో ఉండే అభ్యర్థుల లెక్క తేలింది. నామినేషన్ల ఉపసంహరణతో ప్రధాన ఘట్టం ముగిసింది. సోమవారం నామినేషన్ల స్క్రూటినీ పూర్తికాగా, బుధవారం నామినేషన్ల ఉపసంహరణ పూర్తయింది. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 276 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఈ మేరకు అభ్యర్థుల లెక్కను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా మొత్తంగా 428 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వాటి పరిశీలన 13వ తేదీన చేపట్టారు. ఇందులో నిబంధనలకు అనుగుణంగా లేని 73 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. ఉపసంహరణ గడువు బుధవారంతో ముగిసింది. తిరస్కరణకు గురైన వారు పోగా, మిగిలిన 355 మంది అభ్యర్థుల్లో 79 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 276 మంది బరిలో ఉన్నారు.



మునుగోడులో ఎక్కువ మంది అభ్యర్థులు

మునుగోడు ఉప ఎన్నికల్లో రికార్డు స్థాయిలో నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుత సాధారణ ఎన్నికల్లోనూ ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా 51 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అందులో నిరుద్యోగులు ఉన్నారు. చివరకు ఒక్కరి నామినేషన్ తిరస్కరణకు గురికాగా, 11 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎక్కువ మంది పోటీలో ఉండనున్న నియోజకవర్గంగా మునుగోడు నిలిచింది. అక్కడ 39 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఆ తరువాత స్థానంలో కోదాడ నియోజకవర్గం ఉంది. నామినేషన్ల ఉపసంహరణ తరువాత అక్కడ 34 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

దేవరకొండలో తక్కువ..

దేవరకొండ నియోజకవర్గంలో నామినేషన్లు వేసిన వారు తక్కువ మందే ఉండగా, పోటీలో ఉండే వారి సంఖ్య తక్కువే ఉంది. ఉమ్మడి జిల్లాలోనే అతి తక్కువ మంది పోటీలో ఉన్న నియోజకవర్గంగా దేవరకొండ నిలిచింది. అక్కడ మొత్తంగా 18 మంది నామినేషన్లు దాఖలు చేయగా, ఐదుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 13 మంది మిగిలారు. ప్రస్తుతం వారంతా పోటీలో ఉండబోతున్నారు. అన్ని నియోజకవర్గాల్లో పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా, అక్కడ ఒక్కరు కూడా ఉపసంహరించుకోకపోవడం గమనార్హం.

బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య నియోజకవర్గాల వారీగా

నియోజకవర్గం	2023	2018	2014
ఆలేరు	21	14	15
భువనగిరి	19	15	10
దేవరకొండ	13	10	10
హుజూర్‌నగర్	24	16	09
కోదాడ	34	15	17
మిర్యాలగూడ	23	29	08
మునుగోడు	39	15	23
నాగార్జునసాగర్	15	14	13
నకిరేకల్	23	15	11
నల్లగొండ	31	17	15
సూర్యాపేట	20	25	15
తుంగతుర్తి	14	17	15
మొత్తం	276	202	161

బరిలో కీలక నేతలు

ఈ ఎన్నికల్లో వివిధ పార్టీలకు చెందిన కీలక, సీనియర్ నేతలు పోటీలో ఉన్నారు. సూర్యాపేటలో విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, హుజూర్‌నగర్‌లో మాజీ మంత్రి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నల్లగొండలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వంటి నేతలు బరిలో నిలిచారు. కాగా, మాజీ మంత్రులు జానారెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు ఈసారి పోటీలో లేరు. ప్రతి ఎన్నికల్లోనూ పోటీ చేస్తున్న వారు.. ఇప్పుడు బరిలో లేరు.

పెరగనున్న బ్యాలెట్ యూనిట్లు

పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య పెరగడంతో ఈవీఎంలలోని బ్యాలెట్ యూనిట్ల సంఖ్యను పెంచాల్సి ఉంది. ఈవీఎంలలోని ఒక బ్యాలెట్ యూనిట్‌లో 15 మంది అభ్యర్థుల పేర్లు, ఒక నోటా కలిపి 16 మంది అభ్యర్థుల వరకు ఉంటాయి. ఒక నియోజకవర్గంలో పోటీలో ఉండే అభ్యర్థుల సంఖ్య 16కు మించితే అధికారులు రెండో బ్యాలెట్ యూనిట్ ఏర్పాటు చేస్తారు. 16 నుంచి 32 వరకు రెండవది, 32 నుంచి 48 మంది అభ్యర్థులకు మూడో బ్యాలెట్ యూనిట్ కావాల్సి ఉంటుంది. మునుగోడు నియోజకవర్గంలో 39 మంది పోటీ చేస్తుండగా ఆ నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో మూడు బ్యాలెట్ యూనిట్ల చొప్పున ఏర్పాటు చేయాల్సి ఉంది. కోదాడ నియోజకవర్గంలో 34 మంది బరిలో ఉండగా అక్కడ కూడా మూడు బ్యాలెట్ యూనిట్ల చొప్పున అవసరం ఉన్నాయి. తుంగతుర్తి, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల సంఖ్య 16లోపు ఉండడంతో ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఒక బ్యాలెట్ యూనిట్ సరిపోతుంది. కాగా, అదనపు బ్యాలెట్ యూనిట్ల కోసం ఎన్నికల సంఘానికి ఇండెంట్ పెట్టినట్లు భువనగిరి జిల్లా ఎన్నికల సహాయాధికారి ఒకరు చెప్పారు.

జంగ్ తెలంగాణ

పొద్దంతా హైడ్రామా.. చివరకు ఉపసంహరణ



సూర్యాపేటలో పటేల్ రమేష్‌రెడ్డిని బుజ్జగించేందుకు ఆయన నివాసానికి వెళ్లిన పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవిని అడ్డుకుంటున్న కార్యకర్తలు

ఈసారి జిల్లాలో పెద్దగా రెబల్స్ బెడద లేదు. సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థి పటేల్ రమేష్‌రెడ్డి.. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఇతర నేతలు రంగంలోకి దిగి ఆయనను బుజ్జగించారు. బుధవారం సూర్యాపేటలోని పటేల్ రమేష్‌రెడ్డి ఇంటికి వారంతా చేరుకోవడంతో ఆయన అనుచరులు కాంగ్రెస్ టికెట్ ఎందుకు ఇవ్వలేదని దాడికి ప్రయత్నించడం, చివరకు ఎంపీ టికెట్ ఆఫర్ చేయడంతో చర్చలు ఫలించాయి. ఆయన తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. నల్లగొండలో నామినేషన్ వేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొండేటి మల్లయ్య, నకిరేకల్‌లో నామినేషన్ వేసిన కాంగ్రెస్ నాయకుడు దైద రవీందర్ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇక.. జానారెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి.



నిడమనూరు: నామినేషన్ ఉపసంహరించుకుంటున్నట్టు ఎన్నికల అధికారి శ్రీనివాస్‌కు లేఖ అందజేస్తున్న సాగర్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి తక్కెళ్లపల్లి కోటేశ్వరి



నల్లగొండలో నామినేషన్ ఉపసంహరించుకుని బయటకు వస్తున్న కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి కొండేటి మల్లయ్య

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	మొత్తం నామినేషన్లు	తిరస్కరణ	విత్‌డ్రా	పోటీలో ఉన్న వారు
నల్లగొండ	39	3	5	31
నకిరేకల్	33	2	8	23
మునుగోడు	51	1	11	39
దేవరకొండ	18	5	0	13
మిర్యాలగూడ	45	12	10	23
నాగార్జునసాగర్	28	7	6	15
సూర్యాపేట	42	10	12	20
తుంగతుర్తి	33	12	7	14
హుజూర్‌నగర్	40	5	11	24
కోదాడ	39	3	2	34
ఆలేరు	31	9	1	21
భువనగిరి	29	4	6	19
మొత్తం	428	73	79	276

యువ ఆధిపత్యం
తొలిసారి బరిగీసి..
72 మంది గ్రాడ్యుయేట్లు

పోటీలో వ్యాపారులే అధికం



వివరాలు 10లో

'కారు'కు తప్పని తంటా!

- కారును పోలిన గుర్తులను తొలగించని ఈసీ
- పలుచోట్ల రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు ఆ గుర్తుల కేటాయింపు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: గుర్తును పోలిన గుర్తులు రావడంతో ఈ ఎన్నికల్లోనూ 'కారు'కు తంటా తప్పేలా లేదు. కారు గుర్తును పోలిన రోడ్డు రోలర్, చపాతి మేకర్ గుర్తులను రిజిష్టర్డ్ పార్టీలకు కేటాయించడంతో ఈసారి కూడా బీఆర్‌ఎస్ అభ్యర్థులకు వాటితో నష్టం వాటిల్లనున్నట్లు తెలుస్తోంది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కారును పోలిన గుర్తులు రావడంతో చాలా మంది అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. నకిరేకల్‌లో కారు గుర్తును పోలిన రోడ్డు రోలర్ గుర్తు మరో అభ్యర్థికి రావడంతో ఓటర్లు.. కారనుకుని రోడ్డు రోలర్‌కు ఓట్లు వేయడంతో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన వీరేశం ఓడిపోయారు. ఇక 2022లో జరిగిన మునుగోడు ఉప ఎన్నికల్లో యుగతులసి పార్టీ అభ్యర్థికి రోడ్డు రోలర్ గుర్తు వచ్చింది. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రోడ్డు రోలర్ తొలగించాలని ఆందోళన చేశారు. అధికారులకు విజ్ఞప్తులు చేశారు. దీంతో రిటర్నింగ్ అధికారి ఆ గుర్తు మార్పు చేయడంతో ఎన్నికల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. రిటర్నింగ్ అధికారిపై చర్యలు చేపట్టింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తును పోలిన రోడ్డు రోలర్, చపాతి మేకర్ వంటి ఇతర గుర్తులను తొలగించాలని బీఆర్‌ఎస్ కేంద్ర ఎన్నికల సంఘానికి లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేసింది. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ పూర్తి కావడంతో అన్ని నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాలు, అభ్యర్థుల గుర్తులను ఆర్‌వోలు కేటాయించారు. అందులో కారును పోలిన చపాతి మేకర్, రోడ్డు రోలర్ గుర్తులను రిజిస్టర్డ్ పార్టీ అభ్యర్థులకు కేటాయించారు. స్వతంత్ర అభ్యర్థులకు విసుర్రాయి (చక్కి), కేక్, కుట్టుమిషన్, డోలీ వంటి గుర్తులను కేటాయించారు.



అభ్యర్థులకు ఎలక్షన్ కమిషన్ కేటాయించిన గుర్తులు

ఓటుహక్కు ప్రాధాన్యతపై నేడు అవగాహన సదస్సు

మిర్యాలగూడ: కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఓటుహక్కు ప్రాధాన్యతపై గురువారం ఉదయం 10.30 గంటలకు మిర్యాలగూడలోని మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా క్షేత్ర ప్రచార అధికారి కోటేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జిల్లా నోడల్ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సదస్సులో ఎన్నికల మొబైల్ యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌కు అధికారం ఖాయం

అడవిదేవులపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ మిర్యాలగూడ ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్‌ఆర్) అన్నారు. బుధవారం మండలంలోని మొల్కచర్ల, చింతచెట్టుతండా, కొత్తనందికొండ, బాలాజీతండా, బంగారికుంటతండా, జిలకరకుంటతండా, అడవిదేవులపల్లి, ముదిమాణిక్యం గ్రామాల్లో బత్తుల లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాదిల శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, మండల అధ్యక్షుడు బాలునాయక్, నాయకులు బండి నాగేశ్వర్‌రావు, గౌడుగు హనుమయ్య, గోపగాని హనుమంతు, హరీష్, పసుపులేటి శ్రీనివాస్, గుండా శ్రీనివాస్, వీర్లపాలెం సర్పంచ్ అంజిరెడ్డి, దామరచర్ల సర్పంచ్ కిరణ్, కాంగ్రెస్ పార్టీ దామరచర్ల మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి

నల్లగొండ: ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అభ్యసన, విద్యాసామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులంతా కృషిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) భిక్షపతి సూచించారు. బుధవారం నల్లగొండలోని డైట్ కళాశాలలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులు, మండల విద్యాధికారులతో తొలి మెట్టు, ఉన్నతి, లక్ష్య, డీఎస్‌ఈఎఫ్‌ఆర్‌ఎస్, యూడైస్ ప్లస్ మొదలగు అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి అభ్యాసం చేయించాలని, వర్క్ బుక్‌లో ఉపాధ్యాయులు విధిగా తేదీ, సంతకం పెట్టాలన్నారు. నెలవారీ పరీక్షలు నిర్వహించి సంబంధిత యాప్ నందు అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ సమీక్షలో సమగ్రశిక్ష సమన్వయ అధికారులు రామచందర్, వి.వీరయ్య, ఆర్.వీరేందర్, డీసీఈబీ సెక్రెటరీ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

రామగిరి(నల్లగొండ): ఓపెన్ స్కూల్ 2023–24 విద్యా సంవత్సరానికి టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల గడువు ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ జె.జగదీష్‌కుమార్ ఫోన్ : 8008403523 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రైల్వే ఆదాయం పెంపునకు కృషి

- గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ కేవీకే రెడ్డి

మిర్యాలగూడ అర్బన్: రైల్వే గూడ్స్ ఆదాయం మరింత పెంపునకు కృషి చేస్తున్నామని గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ కేవీకే.రెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైల్వే గూడ్స్ షెడ్‌తోపాటు ఇతర విభాగాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్, బియ్యం పరిశ్రమల వివరాలను తెలుసుకున్నామని, వారికి గూడ్స్ రైళ్లు ఏర్పాటు చేస్తే వారి సరుకులు, ఉత్పత్తులను రవాణా చేసుకునే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. పల్నాడు, విష్ణుపురం, సాగర్ పరిశ్రమలు రవాణా చేసుకునే అవకాశాలు గుర్తించామని, దీంతో గూడ్స్ ఆదాయం పెరగనుందని తెలిపారు. ఆయన వెంట డీసీఎం దినేష్‌కుమార్, సీసీఎం రమేష్‌బాబు, స్టేషన్ సూపరింటెండెంట్ తారేశ్వర్ తదితరులు ఉన్నారు.



మిర్యాలగూడ రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న కేవీకే రెడ్డి తదితరులు

జంగ్ తెలంగాణ

● స్మైల్ ప్లీజ్.. ఓటు ప్లీజ్



ఎన్నికల ప్రచారంలో యాదగిరిగుట్ట మండలంలోని జంగంపల్లిలో మహిళలతో సెల్ఫీ దిగుతున్న ఆలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత

● ఖిలా సాక్షిగా..



భువనగిరి ఖిలా సమీపంలో ఏర్పాటు చేసిన ఓటరు ఫొటో పాయింట్ వద్ద ఫొటో దిగుతున్న పర్యాటకులు

● మా ప్రచారం సపరేట్..



త్రిపురారంలో రిక్షాతో కాంగ్రెస్ పథకాలను ప్రచారం చేస్తున్న యువజన సంఘం నేతలు

● చాయ్ కావాలా..



మిర్యాలగూడలో స్వయంగా టీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి శోభకరంద్లాజే

● మీ భారం నాది..



నల్లగొండలోని పానగల్‌లో ఆటో నడుపుతూ ప్రచారం చేస్తున్న సీపీఎం అభ్యర్థి సుధాకర్‌రెడ్డి

● ఓటేస్తాం.. భుజాలపై మోస్తాం..



అర్వపల్లి మండలం కొమ్మాలలో ఎమ్మెల్యే కిశోర్‌ను ఎత్తుకొని ఊరేగిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పోటీలో యువ ఆధిపత్యం



ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువకులే అధిక సంఖ్యలో పోటీలో ఉన్నారు. 25 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు వయస్సు వారు 23 మంది ఉండగా.. 31 నుంచి 40 ఏళ్ల లోపు వారు 120 మంది ఉన్నారు. మిగతా వారు 41 ఏళ్లకుపై వయసు వారు. పోటీలో నిలిచిన అభ్యర్థుల్లో ఆలేరు నుంచి ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీలో ఉన్న నుచ్చు శివకుమార్ అత్యంత పిన్న వయస్కుడు. ఇతని వయసు 26 ఏళ్లు.

తొలిసారి బరిగీసి..



ఉమ్మడి జిల్లాలో బరిలో నిలిచిన వారిలో ఎక్కువ మంది తొలిసారి పోటీ చేస్తున్న వారే. వీరిలో చాలా మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచారు. తొలిసారి బరిలో నిలిచిన వారు 12 నియోజకవర్గాల్లో 188 మంది ఉన్నారు. ఇందులో ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడా ఉన్నారు.

బరిలో 72 మంది గ్రాడ్యుయేట్లు



బరిలో ఉన్న అభ్యర్థుల్లో డిగ్రీ పూర్తయిన వారు 72 మంది ఉన్నారు. ప్రోస్టు గ్రాడ్యుయేట్లు కూడా ఉన్నారు. సాంకేతిక విద్యనభ్యసించిన వారు 22 మంది ఉన్నారు. పదో తరగతి పూర్తయిన వారు 33 మంది ఉన్నారు. పీహెచ్‌డీ పూర్తయిన వారు 9 మంది ఉండడం విశేషం. మిగతా వారు పదో తరగతి లోపు చదివిన వారు ఉన్నారు.

పోటీలో వ్యాపారులే అధికం



అసెంబ్లీ బరిలో నిలిచిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది వివిధ వ్యాపారాలు చేస్తున్న వారు ఉన్నారు. వీరి తర్వాత వ్యవసాయదారులు ఉన్నారు. మొత్తం అభ్యర్థుల్లో వ్యాపారులు 49 మంది ఉండగా.. వ్యవసాయం చేసే వారు 38 మంది ఉన్నారు. మిగతా వారు కాంట్రాక్టర్లుగా, రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నారు. కొందరు నిరుద్యోగులు, గృహిణులు కూడా బరిలో నిలిచారు.

ప్రజల ఆలోచన మారాలి



రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్

● ఓటు హక్కు అందరికీ సమానం ● రాజకీయ నాయకులు ఎన్నికలను వ్యాపారంగా మార్చారు
● తెలుగు రాష్ట్రాల్లోనే డబ్బు ప్రభావం ఎక్కువ ● జనాభా ప్రాతిపదికన రాజ్యాధికారం దక్కాలి
● గుత్తాధిపత్య రాజకీయాలకు స్వస్తి పలకాలి ● రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్

సాక్షి, నల్లగొండ డెస్క్

ఎన్నికల్లో కోటీశ్వరులకే టికెట్ వస్తుంది.. వారే విజయం సాధిస్తారన్న భావన నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఉద్యమిస్తున్నానని చెబుతున్నారు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్. ప్రస్తుత కాలంలో నాయకులు ఎన్నికలను వ్యాపారంగా మార్చారని ధ్వజమెత్తారు. ఈ పద్ధతి పోవాలని, గుత్తాధిపత్య రాజకీయాలకు స్వస్తి పలకాలని, సమాజంలో కుళ్లును కడగాలని డెమోక్రటిక్ ఫోరం ఫర్ తెలంగాణ సంస్థ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ప్రస్తుత ఎన్నికల తీరు, తన అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

1984 ఐఏఎస్‌గా ఎంపికైన నేను 2016 జూన్‌లో రిటైర్డ్ అయ్యాను. ఈ కాలంలో చాలా రాష్ట్రాల్లో పని చేశాను. తెలంగాణలో కూడా పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీగా విధులు నిర్వర్తించాను. 12 రాష్ట్రాల్లో ఎన్నికల అబ్జర్వర్‌గా పని చేశాను. రిటైర్డ్ అయ్యాక డెమోక్రటిక్ ఫోరం ఫర్ తెలంగాణ సంస్థ ఏర్పాటు చేశాం. నేను రాష్ట్ర కన్వీనర్‌గా, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. జనాభా ప్రాతిపదికన రాజ్యాధికారం కావాలని మా ప్రధాన డిమాండ్. డబ్బుకు అమ్ముడుపోవద్దని.. మంచి నాయకుడిని ఎన్నుకోవాలని ఓటర్లలో చైతన్యం తీసుకొస్తున్నాం. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అందరికీ సమానమని.. దాన్ని ఎందుకు అమ్ముకుంటున్నారన్న దానిపైనే పోరాటం సాగిస్తున్నాం.



నల్లగొండ నుంచి ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్

డబ్బు రాజకీయాలను ఎన్నికల కమిషన్ అడ్డుకోవాలి

ఉమ్మడి ఏపీలో 86 శాతం అక్షరాస్యత ఉండేది. తెలంగాణ విడిపోయిన తర్వాత ఇక్కడ 66 శాతం మాత్రమే అక్షరాస్యత. ఇప్పుడు ఏపీలో 76 శాతం అక్షరాస్యత ఉంది. తెలంగాణలో 34 శాతం నిరక్షరాస్యులు ఉన్నారు. వారిని సొమ్ము చేసుకోవడానికి రాజకీయ నాయకులు ఓట్లను కొనుగోలు చేస్తున్నారు. కొందరు పీహెచ్‌డీ చదివిన వారు కూడా ఓటును అమ్ముకుంటున్నారు. మొన్న మునుగోడు ఉప ఎన్నికలో డబ్బులు ఇస్తేగానీ ఓటు వేయబోమని కొన్నిచోట్ల ఓటర్లు సాయంత్రం వరకు భీష్మించారు. ఇది మారాలి. ఓట్ల కొనుగోలు, డబ్బు రాజకీయాలను అడ్డుకోవడం ఎన్నికల కమిషన్‌కే సాధ్యం. ఈసారి రాష్ట్ర సివిల్ పోలీసుల సంఖ్యతో సమానంగా కేంద్ర పారామిలటరీ బలగాలు వచ్చాయి. విస్తృత తనిఖీలతో డబ్బు ప్రవాహాన్ని అడ్డుకోవచ్చు. 22 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రిటీషర్స్ పోలీసింగ్ వ్యవస్థతోనే మన దేశాన్ని పాలించారు. పోలీస్ వ్యవస్థ ద్వారా ఎన్నికల కమిషన్ ఓట్ల కొనుగోలును నియంత్రించాల్సిన అవసరం ఉంది.

ఆస్తుల వివరాలు వెల్లడించాలి

ఎన్నికల వ్యవస్థపై యువతలో ఇప్పుడిప్పుడే కొద్దిగా మార్పు వస్తోంది. మీడియా ద్వారా వివిధ పద్ధతుల్లో ఓటర్లలో చైతన్యం తీసుకురావాలి. ఆదాయానికి మించి ఆస్తులున్న వారందరిపై కేసులు పెట్టాలి. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు తమ ఆస్తుల వివరాలు లోక్‌పాల్, లోకాయుక్తలో వెల్లడిస్తున్నారు. అలాగే సీఎంలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలంతా లోక్‌పాల్, లోకాయుక్తలో ఆస్తుల వివరాలు పెట్టాలి. డబ్బు పంచకుండా, మద్యం పంపిణీ చేయకుండా ఓట్లు వేయించుకునే శక్తి ఇప్పటి రాజకీయ నాయకులకు లేదు.

రూ.84 మాత్రమే ఖర్చు చేశా..

2018 శాసనసభ ఎన్నికల్లో నేను నల్లగొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశాను. అప్పట్లో కేవలం 84 రూపాయలు మాత్రమే ఖర్చు చేశాను. నాకు 360 ఓట్లు వచ్చాయి. ప్రస్తుత ఎన్నికల్లో నల్లగొండ అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచాను. ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నాను. డబ్బు ప్రమేయం లేకుండా, ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయగలిగితే మావోయిస్టులు కూడా సహకరిస్తారు. నేను దంతెవాడ ప్రాంతంలో ఎన్నికల పరిశీలకుడిగా వెళ్లినప్పుడు.. ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చాను. పోలింగ్ పెరిగేలా చూశాను. నెల్సన్ మండేలా, అబ్రహం లింకన్ అన్నట్లు 'బ్యాలెట్ ఈజ్ మోర్ పవర్‌ఫుల్ ద్యాన్ బుల్లెట్.' దీనిని నిజం చేయాలి.



ఓటు హక్కుపై నల్లగొండలో అవగాహన కల్పిస్తున్న చొల్లేటి ప్రభాకర్

మన దగ్గరే డబ్బు రాజకీయాలు..

నేను సర్వీస్‌లో ఉండగా 12 రాష్ట్రాలకు ఎన్నికల్లో జనరల్ అబ్జర్వర్‌గా వెళ్లాను. అన్నిటి కంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనే డబ్బు రాజకీయం ఎక్కువ. అక్రమ సంపాదకులు కూడా ఈ రెండు రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉన్నారు. 1999లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన దగ్గర నుంచి ఎన్నికల్లో డబ్బు రాజకీయాలు మొదలయ్యాయి. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా, కర్నాటక రాష్ట్రాల్లో కూడా ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఉంది. తమిళనాడులో మాత్రం డబ్బు ప్రభావం చాలా తక్కువ. ఈశాన్య రాష్ట్రాల్లో డబ్బు ప్రభావం దాదాపు ఉండదు. కేరళలో కూడా డబ్బు రాజకీయాలు కనిపించవు. ఆ రాష్ట్రంలో 90 శాతం అక్షరాస్యత ఉంది. వాళ్లకు డబ్బు కాదు.. సేవ చేసే నాయకులనే ఎన్నుకుంటారు.

12 నియోజకవర్గాల్లో బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..

సూర్యాపేట



జగదీష్‌రెడ్డి (బీఆర్‌ఎస్) | దామోదర్‌రెడ్డి (కాంగ్రెస్) | వెంకటేశ్వర్‌రావు (బీజేపీ) | జానయ్యయాదవ్ (బీఎస్పీ)

హుజూర్‌నగర్



సైదిరెడ్డి (బీఆర్‌ఎస్) | ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్) | చల్లా శ్రీలతారెడ్డి (బీజేపీ) | నవీన్‌కుమార్ (బీఎస్పీ) | మల్లు లక్ష్మి (సీపీఎం)

తుంగతుర్తి



గాదరి కిషోర్ (బీఆర్‌ఎస్) | మందుల సామేలు (కాంగ్రెస్) | రామచంద్రయ్య (బీజేపీ) | బొడ్డు కిరణ్ (బీఎస్పీ)

కోదాడ



మల్లయ్య యాదవ్ (బీఆర్‌ఎస్) | పద్మావతిరెడ్డి (కాంగ్రెస్) | సతీష్‌రెడ్డి, (జనసేన) | పి.శ్రీనివాస్ (బీఎస్పీ) | ఎం.సైదులు (సీపీఎం)

మునుగోడు



ప్రభాకర్‌రెడ్డి (బీఆర్‌ఎస్) | రాజగోపాల్‌రెడ్డి (కాంగ్రెస్) | కృష్ణారెడ్డి (బీజేపీ) | డి. నర్సిరెడ్డి (సీపీఎం)

భువనగిరి



పైళ్ల శేఖర్‌రెడ్డి (బీఆర్‌ఎస్) | అనిల్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్) | నారాయణరెడ్డి (బీజేపీ) | కె. నర్సింహ (సీపీఎం)

నకిరేకల్



చిరుమర్తి లింగయ్య (బీఆర్‌ఎస్) | వేముల వీరేశం (కాంగ్రెస్) | మొగిలయ్య (బీజేపీ) | ప్రియదర్శిని (బీఎస్పీ) | చిన్న వెంకులు (సీపీఎం)

మిర్యాలగూడ



భాస్కర్‌రావు (బీఆర్‌ఎస్) | లక్ష్మారెడ్డి (కాంగ్రెస్) | శ్రీనివాస్ (బీజేపీ) | రంగారెడ్డి (సీపీఎం)

నాగార్జునసాగర్



నోముల భగత్ (బీఆర్‌ఎస్) | జయవీర్‌రెడ్డి (కాంగ్రెస్) | నివేదితారెడ్డి (బీజేపీ) | వెంకటరమణ (బీఎస్పీ)

దేవరకొండ



రవీంద్రకుమార్ (బీఆర్‌ఎస్) | బాలునాయక్ (కాంగ్రెస్) | లాలునాయక్ (బీజేపీ) | వెంకటేశ్ చౌహాన్ (బీఎస్పీ)

నల్లగొండ



భూపాల్‌రెడ్డి (బీఆర్‌ఎస్) | వెంకట్‌రెడ్డి (కాంగ్రెస్) | శ్రీనివాస్‌గౌడ్ (బీజేపీ) | ఎం.సుధాకర్‌రెడ్డి (సీపీఎం)

ఆలేరు



గొంగిడి సునీత (బీఆర్‌ఎస్) | బీర్ల ఐలయ్య (కాంగ్రెస్) | పడాల శ్రీనివాస్ (బీజేపీ)

ఫీల్డ్ అసిస్టెంట్‌గా రాజీనామా చేసి కాంగ్రెస్‌లోకి..

భువనగిరి రూరల్ : మండలంలోని వడపర్తి ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న భాగ్య ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ భువనగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కుంభం అనిల్ కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ప్రజా క్షేత్రంలోకి వచ్చి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.



రాజీనామా పత్రం చూపిస్తున్న భాగ్య

అత్యాచారం కేసులో 20ఏళ్లు జైలు శిక్ష

మోత్కూరు: బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో ఓ యువకుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.11వేల జరిమానా విధిస్తూ భువనగిరి కోర్టు తీర్పు ఇచ్చినట్లు మోత్కూరు ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి బుధవారం తెలిపారు. మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన బూడిద ప్రవీణ్ అదే గ్రామానికి చెందిన బాలికపై 2022లో అత్యాచారానికి పాల్పడిన ఘటనలో కేసు నమోదైంది. బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా బాధితురాలికి ప్రభుత్వం రూ.5 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించినట్లు తెలిపారు.

రైలులో ప్రయాణిస్తూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మిర్యాలగూడ అర్బన్: రేపల్లె ట్రైన్‌లో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. మిర్యాలగూడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేపల్లె ట్రైన్‌లో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడనే సమాచారంతో ట్రైన్ మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న అనంతరం స్టేషన్ మేనేజర్ జనరల్ బోగిలోని సదరు వ్యక్తిని కిందకు దింపి 108వాహనంలో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే అతడు అప్పటికే మృతి చెందాడని 108సిబ్బంది నిర్ధారించడంతో మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతుడు 35 నుంచి 40ఏళ్ల మధ్య వయసు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు మిర్యాలగూడ రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

దయ ఉంటే ఓట్లు వేయండి.. లేదంటే లేదు..!

● ఎన్నికల ప్రచారంలో ఆలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత

యాదగిరిగుట్ట రూరల్: 'నేను ఓట్లు అడుక్కోవడానికి వచ్చాను.. మీ దయ ఉంటే ఓట్లు వేయండి.. లేదంటే లేదు' అని ఆలేరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత వ్యాఖ్యానించారు. యాదగిరిగుట్ట మండలంలోని రాళ్లజనగాం గ్రామంలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్వాపురం రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన పలువురు భూ నిర్వాసితులు ఆమె ప్రసంగాన్ని అడ్డుకున్నారు. రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా తాము కోల్పోయిన భూములకు తక్కువ నష్టపరిహారం వచ్చిందని, సరైన న్యాయం జరగలేదని వాపోయారు. దీనిపై సునీత మాట్లాడుతూ.. తాను రాళ్లజనగాం గ్రామం రిజర్వాయర్‌లో పోకుండా సాధ్యమైన రీతిలో కృషిచేశానని, తాను ఓటును అభ్యర్థించడానికి వచ్చానని, ఇష్టముంటే ఓట్లు వేయండి, లేదంటే లేదు అని అసహనం వ్యక్తం చేస్తూ ప్రచార వాహనం దిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు.



రాళ్లజనగాంలో గొంగిడి సునీతతో వాదిస్తున్న బస్వాపూర్ రిజర్వాయర్ భూనిర్వాసితులు

ఎగ్జిబిషన్ నిర్వాహకుడిపై దాడి

● ఆరుగురిపై కేసు నమోదు

కోదాడరూరల్: ఎగ్జిబిషన్ నిర్వాహకుడిపై దాడి చేసిన పలువురిపై పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కోదాడ పట్టణ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఎగ్జిబిషన్‌ను నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం రాత్రి పట్టణానికి చెందిన గుండు రాహుల్, నీలేష్, శివలతో పాటు మరో ఇద్దరు అక్కడకు వెళ్లి టికెట్ తీసుకోకుండా లోపలికి పంపించాలని నిర్వాహకులతో గొడవకు దిగారు. దీంతో వారు లోపలికి అనుమతించకపోవడంతో నిర్వాహకుడైన జాల వెంకటేశ్వర్లును దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. అదే విధంగా ఆ ఐదుగురు యువకులకు సంబంధించిన మరో వ్యక్తి నిర్వాహకుడిని కులం పేరుతో దూషించాడు. ఈ సంఘటనపై బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాము తెలిపారు.